
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 16 జూన్ 2024



26న తపాలా అదాలత్

అరసవల్లి, జూన్ 15: శ్రీకాకుళంలోని తపాలా వినియోగదారుల ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్టు సూపరింటెండెంట్ వి.హరిబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్ దగ్గర, రెల్లివీధిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆ రోజు 11 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. వినియోగదారులు ఫిర్యాదులను 'తపాలా అదాలత్' శీర్షికతో వి.హరిబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, శ్రీకాకుళం డివిజన్, శ్రీకాకుళం-532001 అనే చిరునామాకు పంపాలని సూచించారు. వ్యక్తిగతంగా కూడా అదాలత్‌కు హాజరు కావచ్చని పేర్కొన్నారు.

టిడ్కోకు మోక్షం లభించేనా?

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు
- కేటాయింపులో వైసీపీ పాలకుల నిర్లక్ష్యం
- మౌలిక సదుపాయాలు లేక నిరుపయోగం
- కూటమి రాకతో లబ్ధిదారుల్లో చిగురిస్తున్న ఆశలు



ఇచ్ఛాపురం : ఏఎస్‌పేటలో నిర్మించిన టిడ్కో గృహాలు..

(ఇచ్ఛాపురం)

సొంతింటి కలపై టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టిడ్కో) లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా.. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రాగా.. ఐదేళ్లు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేసింది. టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలపై దృష్టి సారించలేదు. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయింపులోనూ నిర్లక్ష్యం వహించింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశ చెందారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. మళ్లీ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో.. టిడ్కో ఇళ్లకు మోక్షం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన పట్టణ ప్రజల కోసం టీడీపీ ప్రభుత్వం 2017లో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శ్రీకాకుళం కార్పొరేషన్, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలో ఇళ్ల నిర్మాణ పనులు 2019 నాటికి దాదాపు 80 శాతం పూర్తిచేసింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో టిడ్కో పథకం అటకెక్కింది.

- ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలోని పట్టణ శివారున మూడోవార్డు ఏఎస్‌పేటలో 816 టిడ్కో ఇళ్లు నిర్మించారు. 300 స్క్వేర్‌ఫీట్ ఇళ్లు 480, 365 స్కేర్ ఫీట్‌వి 144, 430 స్కేర్‌ఫీట్‌వి 192 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. లబ్ధిదారులను కూడా ఎంపిక చేసి.. వారి వాటా నగదుగా డిపాజిట్లు సేకరించారు. మొదటి రెండు విభాగాల్లోని డబుల్, సింగిల్ బెడ్‌రూమ్‌ల లబ్ధిదారులు.. డిపాజిట్ నగదును వాయిదా పద్ధతిలో చెల్లించారు. కానీ ఇప్పటివరకూ ఇళ్లు కేటాయించక పోవడంతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.
- శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో పాత్రునివలసలో రెండు బ్లాకుల పరిధిలో సుమారు 1800కుపైగా టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇటీవల వెయ్యి ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. కానీ మౌలిక సదుపాయాలు మాత్రం ఆశించినస్థాయిలో లేవు. ప్రధానంగా రోడ్లు, తాగునీటి వసతి లేకపోవడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- పలాస-కాశీబుగ్గ మునిసిపాల్టీ లబ్ధిదారులకు సంబంధించి బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో 950 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో కొంతమంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరుచేశారు. రోడ్లు, నీరు, విద్యుత్, మరుగుదొడ్లు లేవు.
- ఆమదాలవలస మునిసిపాల్టీలో లబ్ధిదారుల కోసం భైరిశాస్త్రులపేట వద్ద 512 టిడ్కో ఇళ్లు నిర్మాణం చేపట్టారు. ఇక్కడ కూడా అదే పరిస్థితి.

రుణాల బెడద..

టిడ్కో లబ్ధిదారులు తమ వాటా నగదు కొంత చెల్లించిన తర్వాత బ్యాంకుల్లో ఆయా కేటగిరీకి సంబంధించిన లబ్ధిదారుల ప్రమేయం లేకుండానే వారి పేరుతో రుణాలు మంజూరు చేయించారు. గతేడాది చివరిలో కొంతమంది లబ్ధిదారులకు రుణాల వాయిదా చెల్లించాలని బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో ఆందోళన చెందారు. మాకు ఇళ్లు కేటాయించకుండానే రుణాలు చెల్లించడమేంటని అధికారులను ప్రశ్నించారు. దీనిపై టీడీపీ ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఆందోళన చేపట్టగా నోటీసుల వివాదం సద్దుమణిగింది. అలాగే అప్పట్లో డీడీలు చెల్లించిన వారిలో చాలామందికి ఇళ్లు కేటాయించకుండా మొండిచేయి చూపారు. ఇల్లు కానీ, స్థలం కానీ మంజూరు చేయకపోగా.. డీడీ డబ్బులు కూడా ఇంత వరకు వెనక్కి తిరిగివ్వలేదు. అప్పు చేసి డీడీల రూపంలో నగదు చెల్లించాలని లబ్ధిదారులు వాపోతున్నారు.

అదిగో.. ఇదిగో.. అంటూనే..

వైసీపీ పాలనలో టిడ్కో గృహాల పనులు నిలిచిపోయాయి. ఎన్నికలకు రెండేళ్ల ముందు అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం.. అంటూ అప్పటి సీఎం జగన్ లబ్ధిదారులకు ఆశ చూపారు. ఎన్నికలకు ముందు కొంతమందికి హడావుడిగా గృహాల పట్టాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. కానీ మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ విఫలమయ్యారు. టిడ్కో గృహాలకు వైసీపీ రంగులు వేసి వదిలేశారు. రహదారులు నిర్మించకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి. గృహాల చుట్టూ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం మందుబాబులు, పేకాటరాయుళ్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని పలువురు ఆరోపిస్తున్నారు. కిటికీలు, తలుపులు కూడా సక్రమంగా లేవని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి టిడ్కో ఇళ్లకు మోక్షం కల్పించాలని కోరుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టి.. లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పలాసలో టిడ్కో గృహాల మధ్య వ్యర్థాలు..

నదుల అనుసంధానంపై ఆశలు

- ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిన పనులు
- కూటమి ప్రభుత్వంతో కదలిక వస్తుందని రైతుల ఆకాంక్ష



వెన్నెలవలసలో తుప్పుపట్టిన నదుల అనుసంధాన కాంక్రీట్ నిర్మాణ ఇనుప ఊచలు

(సరుబుజ్జిలి)

నదుల అనుసంధానంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. శివారు భూములకు సైతం సాగునీరు అందజేయాలనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు వంశధార, నాగావళి నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారు. 2017లో సుమారు రూ.90 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అప్పటి విప్.. ప్రస్తుత ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ నదుల అనుసంధాన పనులకు శంకుస్థాపన చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా.. 70శాతం పూర్తిచేసి ఎగువ ప్రాంత రైతులందరికీ సాగునీరు అందించారు. నాగావళి నదిలో పుష్కలంగా నీరు ప్రవహించడానికి చర్యలు చేపట్టారు. దీంతో శ్రీకాకుళం, గార మండలాల రైతులకు కూడా పూర్తిస్థాయిలో సాగు నీరు అందుతుందని ఆశ పడ్డారు. అలాగే హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస మండలాల్లో సాగు భూములకు పుష్కలంగా నీరు అందుతుందని రైతులు సంబరపడ్డారు. కాగా.. ఇంతలో 2019లో సార్వత్రిక ఎన్నికలు రాగా.. వైసీపీ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం మారడంతో.. నదుల అనుసంధానం పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లూ తీవ్ర నిర్లక్ష్యం చూపింది. దీంతో కాలువ తవ్వకాలతోపాటు కాంక్రీట్ నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడింది. సాగు నీరు అందక రైతులు నిరాశ పడ్డారు. ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నదుల అనుసంధానంపై మళ్లీ కదలిక వస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు.



వెన్నెలవలస వద్ద ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న చంద్రబాబు (ఫైల్)

పూర్తికాని హెచ్‌ఎల్‌సీ నిర్మాణ పనులు

- 2017-18లో వంశధార కుడికాలువ పరిధిలో సుమారు రూ.145 కోట్లతో 600 క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉన్న దాదాపు 34 కిలోమీటర్ల హైలెవెల్ కెనాల్ (హెచ్‌ఎల్‌సీ) నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి.. 60 శాతం పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనుల ఊసేలేదు. దీంతో హిరమండలం, లక్ష్మీనర్సుపేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల రైతులకు వంశధార కుడికాలువ నుంచి సాగునీటి సరఫరా కలగానే మిగులుతోంది. ఈ హెచ్‌ఎల్‌సీ నిర్మాణానికి సుమారు 637 ఎక రాలు అవసరం కాగా, అధికారులు 597 ఎకరాలు భూసేకరణ చేపట్టారు. శ్రీరాంవలస, చిగురు వలస, లక్ష్మీపురం, బొత్తాడసింగి, డకరవలస, అమృ త లింగానగరం గ్రామాలకు చెందిన రైతులకు సుమారు 34 ఎకరాలకు సంబంధించి రూ. 6.92 కోట్లు చెల్లించాల్సి ఉంది. దేవదాయశాఖకు చెంది న 5.51 ఎకరాల భూముల సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో కాలువలో రెల్లిగడ్డి, పూడికలు పేరుకుపోయాయి.
- వంశధార కాలువపై 66 నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 34 పూర్తయ్యాయి. మరో 23 వివిధ దశల్లో ఉన్నాయి. ఏడు పను ల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదు. వివిధ దశల్లో ఉన్న కాంక్రీట్ పనుల వద్ద ఏర్పాటు చేసిన ఇనుపగజాలు నీటిలో నానుతూ తుప్పుపడు తున్నాయి. గతేడాది టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల పరిశీలన చేపట్టారు. ఇందులో భాగంగా సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద హెచ్‌ఎల్‌సీ నిర్మాణంలో భాగంగా నిలిచిన అండర్ టన్నెల్ పరిస్థితిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడుతో కలిసి పరిశీలించారు. సాగునీటి ప్రాజెక్టులపై వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యంపై ధ్వజమెత్తారు. తాము అధికారం లోకి వస్తే సాగునీటి ప్రాజెక్టులు బాగు చేస్తామని స్పష్టం చేశారు.
- ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 23న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆమదాలవలస, పాతపట్నంలో ప్రజాగళం సభలు నిర్వహించారు. తాము అధికారంలోకి వస్తే వలసలు నివారిస్తామని.. ఉపాధి మార్గాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నదుల అనుసంధానం తన కల అని.. వంశధార, బ్యారేజీ తదితర ప్రాజెక్టు లను పూర్తిచేసి ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తామని స్పష్టం చేశారు. 'వైసీపీ పాలనలో ఆఫ్‌షో ర్ రిజర్వాయర్, మహేంద్రత నయ ప్రాజెక్టులను పూర్తిచేయలేదు. వంశధారకు రూపాయి కూడా ఖర్చుచేయ లేదు. వంశధార నాగావళి నదుల అనుసంధానం పూర్తిచేయలేదు. రైతులు ఈ ఐదేళ్లూ సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తామని, రైతుల కష్టాలు తీర్చుతాము' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతుందని రైతులు ఆకాంక్షిస్తున్నారు. ఆమదాలవలస నియో జకవర్గ ఎమ్మెల్యేగా కూన రవికుమార్ మళ్లీ ఎన్నిక కావడంతో పనులు ఊపందుకుంటాయని.. సాగునీటి కల నెరవేరుతుందని భావిస్తున్నారు.



సరుబుజ్జిలి : శ్రీరామ్‌వలసలో అధ్వానంగా నదుల అనుసంధాన కాలువ



శిరిఖండి వద్ద గుంతల రహదారి ఇలా..

అమ్మో.. ఆ రోడ్డా!

మెళియాపుట్టి - పాతపట్నం వెళ్లే ఆల్ ఆంధ్రా రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. తిడ్డిమి నుంచి పెద్దపద్మాపురం వరకు రహదారి గోతులమయమవడంతో నరకయాతన పడుతున్నారు. ఈ రహదారిపై రోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీస మరమ్మతులు లేక ఎక్కడికక్కడ రాళ్లు తేలి.. గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరి.. ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. కాగా.. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి గతేడాది రూ.2కోట్లు నిధులు మంజూరైనా టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పనులు చేయలేదని ఆర్అండ్‌బీ ఏఈ నాయుడు తెలిపారు.

- మెళియాపుట్టి

భారీ వర్షం

- రహదారులు జలమయం

(ఆంధ్రజ్యోతి బృందం)

జిల్లాలో పలు ప్రాంతాల్లో శనివారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. సరుబుజ్జిలిలో నాలుగురోడ్ల కూడలి జలమయమైంది. ఏబీ రహదారి చెరువును తలపించింది. శ్రీకాకుళం, కొత్తూరు, పాలకొండ, సరుబుజ్జిలి ప్రధాన రహదారులపై రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పాతపట్నంలోనూ భారీ వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి.



సరుబుజ్జిలి జంక్షన్‌లో చెరువును తలపిస్తున్న ఏబీ రహదారి

పిడుగుపాటుకు ఆవులు మృతి

బూర్జ, జూన్ 15: బూర్జ మండలంలో శనివారం పిడుగుపాటుకు గురై రెండు ఆవులు మృతి చెందాయి. కొల్లివలసలోని దూబ గౌరునాయుడు, మామిడివలసలోని పైల అప్పలనాయుడు ఆవులు పొలంలో మేస్తుండగా.. పిడుగులు పడ్డాయి. దీంతో అవి అక్కడికక్కడే మృతి చెందడంతో రైతులు లబోదిబోమన్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు. మండల పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకట్.. సంఘటనా స్థలాలకు వెళ్లి పరిశీలించారు. పిడుగులు పడే సమయంలో రైతులు ఎవరూ పొలంలోకి పశువులు తీసుకెళ్లవద్దని సూచించారు. బాధిత రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

విలక్షణ కెరీర్‌కు వీలుకల్పించే
లెదర్ టెక్నాలజీ

మనం పెట్టుకునే బెల్ట్, ఉపయోగించే బ్యాగ్, వేసుకునే చెప్పులు చాలావరకు తోలు ఉత్పత్తులు. జాగ్రత్తగా వినియోగించుకుంటే చాలా కాలం మన్నిక కలిగి ఉంటాయి. నిజానికి ఒక జంతువుకు సంబంధించిన తోలు లేదంటే చర్మం మూడు రోజులకే కుళ్ళిపోయి నాశనమవుతుంది, వాసన వస్తుంది. దాన్ని అలా కానివ్వకుండా రసాయనాలు/ వెజిటబుల్ మెటీరియల్‌తో సంరక్షించి, ఉత్పత్తికి అనువైనదిగా మార్చడం మొదలుకుని తుది ఉత్పత్తి వరకు యావత్తు వ్యవహారాలపై అవగాహన కలిగించేదే లెదర్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత కోర్సులు ఉన్నాయి.



తెలంగాణ - హైదరాబాద్‌లో మాత్రమే గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ఉంది. మెహదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లే దారిలోని రాయదర్గ వద్ద దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ఏఐసీటీఈ ఆమోదంతో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌కు అనుబంధంగా ఆరంభమైంది. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తోంది.

- లెదర్ గూడ్స్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా మూడు యూనివర్సిటీల కోటా అమలవుతుంది. ఎస్ఎస్‌సీ(టెన్త్) ఉత్తీర్ణులు ఇందులో చేసేందుకు అర్హులు. ఈ కోర్సులో చేరేందుకు గరిష్ఠ వయోపరిమితి అంటూ ఏమీ లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది. ఈ రెండు కోర్సుల బోధనకు అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయి. ఫుట్‌వేర్ ఫ్యాషన్ స్టూడియో, స్మార్ట్ తరగతి గదులు, అర్హతలకు తోడు అనుభవం ఉన్న ఫ్యాకల్టీ, డిజిటల్ లైబ్రరీ, ఈ బుక్స్, ఈ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఆధునిక ల్యాబ్స్ - మెషినరీ, బాలురకు హాస్టల్ సదుపాయం కూడా ఉంది.

- కోర్సు కాలవ్యవధి ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ కోర్సులో లెదర్‌కు సంబంధించి డిజైన్, ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ కొత్తగా మెటీరియల్ టెక్నిక్‌ను బోధిస్తారు. ముడిపదార్థంగా తోలుతో మొదలు పెట్టి ఫినిషింగ్ ప్రొడక్ట్ వరకు ప్రతి అంశాన్నీ థియరీలో భాగంగా చెబుతారు. చర్మం లేదా తోలుకు రంగు, మందం అలాగే విలువ పెంచడానికి అవసరమైన అన్ని వ్యవహారాలను ఈ కోర్సులో చేరిన విద్యార్థులు చదువుకోవాలి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలోనే ప్రాక్టికల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అలవడతాయి. ఇండస్ట్రీ రెడీగా విద్యార్థులు తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు స్టయిపెండ్‌గా లభిస్తుంది.
- దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిడాస్, రీబాక్, నైక్, హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి. ఫుట్‌వేర్ డిజైనింగ్, లెదర్ గూడ్స్ డిజైనింగ్, ప్రొడక్షన్ ఆఫ్ ఫుట్‌వేర్, ప్రొడక్షన్ ఆఫ్ లెదర్ గూడ్స్ ప్రొడక్షన్/టానింగ్ ఆఫ్ లెదర్, టెస్టింగ్ అండ్ క్వాలిటీ కంట్రోల్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. మూడు నుంచి అయిదేళ్ళ అనుభవంతో ఆంత్రప్రెన్యూర్లుగానూ మారవచ్చు. సొంతంగా యూనిట్ పెట్టుకోవచ్చు. డిప్లొమాతోనే కొందరు విద్యార్థులు విదేశాల్లోని బహుళ జాతి సంస్థల్లో చేరుతున్నారు. ముఖ్యంగా చైనా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఉపాధి పొందుతున్నారు.
- డిమాండ్ అధికంగా ఉండటంతో కొం దరు డిప్లొమా పూర్తి చేయకున్నప్పటికీ, కేవలం వ్యక్తిగత సంబంధాలతో కొద్దిపాటి జ్ఞానంతోనే జాబ్స్ పొందుతుండటం విశేషం.

ఉన్నత చదువులు: లెదర్ టెక్నాలజీలో డిప్లొమాతోనే చదువు ఆపేయనవసరం లేదు. ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

DIKSUCHI - దిక్సూచి

జాబ్ కార్నర్

సింగరేణిలో
మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఖాళీలు 272

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులు

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(మైనింగ్), ఈ2 గ్రేడ్: **139**
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్: **22**
3. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(పర్సనల్), ఈ2 గ్రేడ్: 22
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఐఈ), ఈ2 గ్రేడ్: 10
5. జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: 10
6. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హైడ్రో- జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్: 2
7. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సివిల్), ఈ2 గ్రేడ్: 18
8. జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: 3
9. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్: 30

- నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు

10. సబ్-ఓవర్సీస్ ట్రెయినీ(సివిల్), టిఅండ్ ఎస్ గ్రేడ్-సి: 16

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్), సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంబీబీఎస్, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: గరిష్ఠంగా 30 ఏళ్లు మించకూడదు. జీడీఎంవో పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 19

వెబ్‌సైట్: scclmines.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/UI6jhodలో చదవండి.

వర్కింగ్ స్టిల్‌తో ఉస్తాద్



పవన్‌కల్యాణ్; డైరెక్టర్ హరీశ్ శంకర్ కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల ఇందులో కథానాయికగా నటిస్తున్నారు. శనివారం డైరెక్టర్ హరీశ్ శంకర్ ఈ సినిమా వర్కింగ్ స్టిల్‌ను విడుదల చేశారు.

మొక్కు తీర్చుకున్న సాయితేజ్

తన మేనమామ పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన సందర్భంగా హీరో సాయిదుర్గాతేజ్ తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. సాయిదుర్గాతేజ్, అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేసిన విషయం తనకు తెలియదని ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో నిహారిక కొణిదెల అన్నారు



పవన్‌కు బహుమతి

పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచి.. ఇటీవలే ఉప ముఖ్యమంత్రి హోదానూ దక్కించుకున్నారు పవన్‌కల్యాణ్. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఆయన తన అన్నయ్య చిరంజీవి ఇంటికి వెళ్లారు. అక్కడ చిరంజీవి సతీమణి సురేఖ పవన్‌కు విలువైన మాంట్‌బ్లాంక్ పెన్నును బహుమతిగా ఇచ్చారు. "తెలుగు ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తావని ఆశిస్తూ.. ఆశీర్వదిస్తున్నాం" అని చిరంజీవి, సురేఖ అన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి, సురేఖ, అన్నా లెజినోవా, పవన్ కలిసి ఫొటో దిగారు.

'గరం గరం'




నాని సరికొత్త పాత్రలో నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న సినిమా విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'గరం గరం' అంటూ సాగే ఈ పాటను విశాల్ దద్లానీ ఆలపించారు. సహపతి భరద్వాజ్ లిరిక్స్ అందించగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు.

'భైరవ యాంథమ్'



ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 ఏ.డీ' నుంచి ఓ ప్రోమో సాంగ్ విడుదలైంది. 'భైరవ యాంథమ్' అని సాగే ఈ పాటను భారతదేశపు అతిపెద్ద పాటగా మేకర్స్ తెలిపారు. 21 సెకండ్స్ పాటూ సాగిన ఈ ప్రోమో సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే ఆలపించారు. పూర్తి పాటను నేడు విడుదల చేయనున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈనెల 27న విడుదలవుతోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే, దిశాపటాని కథానాయికలు.

ఆగస్టులో ఇస్మార్ట్



రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఇది 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ.

మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదుగా...



సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వం వహిస్తున్నారు, పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ "ఇటువంటి ఫీల్ గుడ్ చిత్రాలు తీస్తున్నందుకు చిత్రబృందాన్ని అభినందిస్తున్నాను. ఈ మూవీ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.

ఈ విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది



సుధీర్‌బాబు నటించిన లేటెస్ట్ చిత్రం 'హరోంహర'. మాళవిక శర్మ ఇందులో హీరోయిన్‌గా నటించారు. జ్ఞాన సాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సుబ్రమణ్యం.జి, సుమంత్ నాయుడు.జి మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా కథ వినగానే తండ్రీ కొడుకుల సెంటిమెంట్, కథానాయకుడి పాత్ర నన్ను బాగా ఆకర్షించాయి. వెంటనే సినిమాను నిర్మించడానికి ఒప్పుకున్నా. ఈ సినిమా విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది. విడుదలైన అన్ని చోట్లా థియేటర్లు నిండిపోవడం చూసి ఎంతో ఆనందంగా ఉంది. మంచి సినిమా తీశామని ప్రేక్షకులు, మిత్రులు, ఇండస్ట్రీ పెద్దలు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. ప్రస్తుతం మూడు నాలుగు చిత్రాలు నిర్మిస్తున్నాం. వాటి గురించి త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తాము" అని చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PySH7NE లో చదవండి.

ప్రేక్షకులు షాక్ అవుతారు



'నా జీవితంలో మరిచిపోలేని సినిమా 'ఏ'. 26 ఏళ్ల క్రితం ఈ సినిమా విడుదలవుతున్నప్పుడు ఎంత ఉత్సాహంగా ఉన్నానో, ఇప్పుడూ అదే ఉత్సాహంతో ఉన్నాను. ఈ నెల 21న ఈ చిత్రాన్ని తెలుగులో రీ రిలీజ్ చేస్తున్నాం. థియేటర్లలో 'ఏ' సినిమాను చూసి ఇప్పటి ప్రేక్షకులు షాక్ అవుతారు' అని కన్నడ హీరో ఉపేంద్ర అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఏ' చిత్రాన్ని నిర్మాత లింగం యాదవ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ శనివారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో ఉపేంద్ర పాల్గొన్నారు.

ఇక రాజకీయాల జోలికి వెళ్లను



ఇక నుంచి తాను రాజకీయ ప్రేరేపిత కథాంశాలతో సినిమాలు చేయనని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల చుట్టూ అల్లుకున్న వివాదాస్పద అంశాలతో పలు సినిమాలు చేస్తూ వార్తల్లో నిలిచారు వర్మ. ఇప్పుడు ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఆయన తోక ముడిచినట్లు కనిపిస్తోంది. తన సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాజకీయాలపై సినిమాలు చేయడం మానుకుంటున్నాను. ఇక నుంచి దేవుళ్లపై సినిమాలు చేస్తాను అని చెప్పారు.

అన్ని చోట్లా ఆదరిస్తున్నారు



కన్నడ హీరో యశ్ నటించిన ఓ చిత్రం తెలుగులో 'రాజధాని రౌడీ' పేరుతో విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మా 'రాజధాని రౌడీ' చిత్రాన్ని 94 కేంద్రాల్లో విడుదల చేశాం. అన్ని చోట్లా మంచి వసూళ్లు వస్తున్నాయి. ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం: ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమంలో తొలి సారి పాల్గొనడం ఆనందంగా ఉందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులకు విత్తనాలను పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. అధికారుల సూచన లను పాటించి సాగు చేయాలని రైతులను కోరారు. పలు సమస్యలను ఆయనదృష్టికి అధికారులు, రైతులు తీసుకువెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జేడీఏ కోలగిరి శ్రీధర్, ఏడీఏ లింగాల వెంకటమధు, ఏవో బొడ్డేపల్లి రవికుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలి

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిలా బోధన చేసి ప్రజలకు నమ్మకం పెంచాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పెద్దసీది జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, విద్యా సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమం లో ఎంఈవో బి.శ్రీధర్, హెచ్ఎం బెవర రామ్మూర్తి, నాయకులు సలాన మోహనరావు, పైల బాబ్జీ, మంచు కృష్ణారావు, సైలాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల నెరవేర్చేందుకు శ్రీకారం



కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం: పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. మెగా డీఎస్సీ, సామాజిక పింఛన్ల మొత్తం పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు తదితర అంశాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, నేతలు ఎస్. తేజేశ్వరరావు, శ్రీరామ్ ప్రసాద్, భాను తదితరులు పాల్గొన్నారు.

మనిషిగా మారి అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూన్ 15: మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు ఇప్పటికైనా మనిషిగా మారి పలాస అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో సోషల్ మీడియా ను మంచికి వినియోగించాల్సింది పోయి రెచ్చగొట్టేలా, కుటుంబాలు నాశనమయ్యేలా పోస్టులు పెట్టి వికృతానందం పొందారని, టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి వికృత చేష్టలకు పాల్పడితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పార్టీ ఓడిపోయినా ఇంకా ప్రజల ను మభ్యపెట్టే మాటలు మానలేదని, టీడీపీ నేతలు దాడులు చేస్తున్నారంటూ ఏకరవు పెట్టడం తగదన్నారు. మా ప్రభుత్వంలో రివైంజ్ పాలిటిక్స్ ఉండవని, గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఆస్తులు కొల్లగొట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్థిక పట్టణంగా పలాసను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని, అభివృద్ధిలో అందరి సలహాల మేరకే పనులు చేపడతామన్నారు. సేవ్ పలాస, సేఫ్ పలాసగా ఉండేందుకు అంతా సహకరించాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, మల్లా శ్రీనివాస్, గురిటి సూర్యనారాయణ, జోగ మల్లి, దువ్వాడ శ్రీకాంత్, లొడగల కామేశ్వరరావుయాదవ్, రామకృష్ణ, సత్యం, కోట్ని దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి



ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పలాస/వజ్రపుకొత్తూరు: జీడి పిక్కలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని జిల్లా జీడి రైతుసంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే గౌతు శిరీషను రైతులతో కలిసి వినతి పత్రం అందించారు. 80 కిలోల జీడి పిక్కల బస్తా రూ.16 వేలు ప్రకటించాలని కోరారు. స్థానిక జీడి పిక్కలు పూర్తిగా కొను గోలు చేసిన తరువాతే విదేశీ పిక్కలకు అనుమతులివ్వాలని, పలాస కేంద్రంగా జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నేతలు కుత్తుమ వినోద్‌కుమార్, కోనేరు ఆదినారాయణరావు, జోగారావు, సురేష్, రామకృష్ణ, సురేఖ, రాఘవులు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'ఎత్తిపోతల'తో సాగునీరందించండి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: నియోజకవర్గంలో ఉన్న ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఏపీఐడీసీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో వేర్వేరుగా సమీక్షించారు. బొంతు ఎత్తి పోతల పథకం పనులు చురుగ్గా సాగించాలని, అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. టెక్కలి పాడు ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతీ రైతుకు సాగు నీరందించాలన్నారు. మరమ్మత్తులకు గురైన తొగిరి, గడ్డెయ్యపేట ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అలాగే ఇంటింటికీ కొళాయిల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులను సరిదిద్దాలన్నారు. ప్రతి ఇంటికి యూనిఫాంగా కొళాయిలు వేయాలని, వైసీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వేసిన అదనపు కొళాయిలు, పెద్ద పైపులను తొలగించాలన్నారు. సమావేశంలో ఏపీఐడీసీ ఈఈ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సుదర్శనరావు, ఏఈ శ్రీనివాసరావు, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఎమ్మెల్యే రమణమూర్తికి అభినందన

జలుమూరు: ఎమ్మెల్యేగా ఎన్నికైన బగ్గు రమణమూర్తికి రావిపాడు గ్రామానికి చెందిన యువకులు శనివారం అభినందించారు. గొల్లంగి సత్యనారాయణ ఆధ్వర్యంలో యువకులు ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా మబగాం చేరుకొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రావిపాడు పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోండి

● మంత్రి అచ్చెన్నను కోరిన గ్రానైట్ యాజమాన్యాలు

టెక్కలి: రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం విజయవాడలో జిల్లాలోని పలు గ్రానైట్ క్వారీ యాజమాన్య ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. గడచిన ఐదేళ్లగా గ్రానైట్ క్వారీ యాజమాన్యాలు ఎదుర్కొన్న సమస్యలు, పలు రకాల పన్నుల ప్రభావంతో పడిన ఇబ్బందులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. గ్రానైట్ పరిశ్రమకు ఉన్న రాయితీలు గత ప్రభుత్వ హయాంలో ఎత్తి వేయడంతో జరిగిన నష్టాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కల్పించే గ్రానైట్ పరిశ్రమను తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడును వారు కోరారు. అచ్చెన్నాయుడును కలిసిన వారిలో ఉత్తరాంధ్ర గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోత మురళీధర్, మధుకాన్ శ్రీనివాస్, హరి, నగేష్, ఎల్.శ్రీనివాస్, రామారావు, లక్ష్మీనారాయణ, రాజేష్, మోడల్ రవి తదితరులున్నారు.



అచ్చెన్నాయుడును కలిసిన ఉత్తరాంధ్ర గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం

అచ్చెన్నకు ఎల్‌ఎల్‌నాయుడు అభినందన



సంతబొమ్మాళి: రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్థక, మత్స్య శాఖామంత్రిగా నియమితులైన ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ ఎల్ఎల్ నాయుడు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని ఆయనను కలిసి బొకే ఇచ్చి అభినందించారు. వ్యవసాయ మంత్రిగా అచ్చెన్నాయుడు వస్తుండడంతో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుతాయని రైతులు ధైర్యంగా ఉన్నారని ఎల్‌ఎల్‌నాయుడు అన్నారు.

మంత్రి అచ్చెన్నతో తీర ప్రాంతానికి మహర్దశ

సంతబొమ్మాళి: వ్యవసాయ, మత్స్యశాఖా మంత్రిగా టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును నియమించడంతో తీర ప్రాంత గ్రామాలకు మహర్దశ పట్టనుందని టీడీపీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు, టీడీపీ నాయకుడు కోట నారంనాయుడు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో సుదూర తీరప్రాంతం ఉందని, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అచ్చె న్నాయుడుకు సంపూర్ణ అవగాహన ఉందన్నారు. మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, బోట్లు, డీజిల్ అందించడంతో పాటు సంక్షేమ పథకాలు అందించే అవకాశాలున్నాయన్నారు. వ్యవసాయంపై ఆధారపడే జిల్లాలో వ్యవసాయ మంత్రిగా సకాలంలో విత్తనాలతో పాటు, ఎరువులు, పురుగు మందులు అందించి రైతులకు న్యాయం చేస్తారన్నారు.

108 సేవలను వినియోగించుకోండి

మెళియాపుట్టి/మందస: ప్రమాదంలో ఉన్న సమయంలో 108 సేవలను వినియోగించుకోవాలని పలాస డివిజన్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు కోరారు. శనివారం 108 అంబులెన్స్‌ను మెళియాపుట్టి, మందసల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరికరాలు, రికార్డులను తనిఖీ చేశారు. పేద ప్రజలకు సక్రమంగా సేవలు అందించాలని సూచించారు. ప్రతి మారుమూల గ్రామాలకు వెళ్లి అత్యవసర సేవలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. విధుల్లో అలసత్వం వహించవద్దన్నారు. ఆయనతో పాటు ఈయం సరోజిని, సిబ్బంది చంద్రశేఖర్, మోహనరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు లేకుండా నిఘా ఉంచాలి

నరసన్నపేట: వంశధార నదీ తీర ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా నిరంతరం పర్యవేంచాలని శ్రీకాకుళం ఆర్డీవో రంగయ్య ఆదేశించారు. శనివారం మడపాం, బుచ్చిపేట, చేనుల వలస ఇసుక ర్యాంపులను పరిశీలించారు. యంత్రాలతో అక్రమంగా ఇసుక లారీలకు లోడ్ చేసే సమ యంలో రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని నదీ తీర గ్రామాల్లో టాంటాం వేయించాలని సూచించారు. వీఆర్ఏలు అప్రమత్తంగా ఉండి వీఆర్వోకు, ఆర్ఐకు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. తహసీల్దార్ కనకారావు, ఎస్ఈబీ సీఐ సతీష్, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

నేడు జానపద కళాకారుల ఆత్మీయ సమావేశం

పలాసరూరల్: గిడుగు రామమూర్తి తెలుగుభాష, జానపద కళాపీఠం ఆధ్వర్యంలో జానపద, వృత్తి కళాకారులతో ఆదివారం ఉదయం 10గంటలకు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ఏర్పడి 20 వసంతాలు పూర్తయిన సందర్భంగా కళాకారులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కళాకారులు హాజరుకావాలని కోరారు.

గోరువాని చెరువు అభివృద్ధి శూన్యం

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలోని గోరువాని చెరువు అభివృద్ధి ఏమీ లేదని, చెరువులో పెంచిన చేపలను సర్పంచ్, ఈవోలు కుమ్మక్కై అమ్ముకుని జేబులు నింపుకున్నారని ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు ఆరోపించారు. శనివారం చెరువులో చేపలు తీయడాన్ని పరిశీలించారు. ఎటు వంటి వేలం లేకుండా చేపలను ఏవిధంగా తీస్తున్నారని ప్రశ్నించారు. రెండు నెలల కిందట రూ.లక్ష విలువైన చేపలను విక్రయించారని, శనివారం మరో రూ.లక్ష విలువ చేసే చేపలను విక్రయించినా ఆ మొత్తాన్ని పంచాయతీ ఖాతాలో జమచేయలేదని విమర్శించారు. పంచాయతీ నిధులు రూ.10 లక్షలు, ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు మొత్తం రూ.20 లక్షలతో చెరువును అభివృద్ధి చేసినట్లు రికార్డుల్లో చూపించారని, అయితే క్షేత్రస్థాయిలో ఏమీ చేయలేదన్నారు. చేపల సొమ్మును పంచాయతీకి జమ చేయాలని డిమాండ్ చేశారు.

పవన్‌కు సముచిత స్థానంపై హర్షం

నందిగాం: రాష్ట్ర క్యాబినెట్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని జనసేన మండల అధ్యక్షుడు తాడేల చిరంజీవి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి విజయడంకా మోగించడంలో పవన్ కల్యాణ్ పాత్ర అద్భుత మన్నారు. ఆయనకు ఉప ముఖ్యమంత్రితో పాటు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖలు కేటాయించడం ఆనందదాయకమని, దీంతో ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కలమట



శ్రీకాకుళం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి శనివారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నాలుగో పర్యాయం సీఎంగా ప్రమాణం చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. టీడీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉండి పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని చంద్రబాబునాయుడు సూచించినట్లు కలమట రమణ తెలిపారు.

పిల్లలను పనిలో పెడితే కేసుల నమోదు

హిరమండలం: బాలలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హిరమండలం సహాయ కార్మిక అధికారి వైశైలేష్ కుమార్ అన్నారు. శనివారం హిరమండలంలో చైల్డ్ వెల్ఫేర్, మానవ అక్రమ రవాణా విభాగం, సమగ్ర శిక్ష అభియాన్, బాలల సంరక్షణ విభాగం, పోలీసు సిబ్బందితో కలిసి దుకాణాలు, హోటళ్లను తనిఖీ చేశారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలకార్మిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమలో ఎంఈవో కె.రాంబాబు, ఏఎస్ఐ సుధాకర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా విత్తనాలు అందించాలి



మాట్లాడుతున్న మామిడి భీమారావు

హరిపురం: రైతులకు సరిపడా విత్తనాలను సబ్సిడీపై అందించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు డిమాండ్ చేశారు. మందస మండలం రట్టి గ్రామంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, నేటికీ రైతులకు విత్తనాలు చేరలేదన్నారు. ఇప్పటికే వ్యవసాయాధికారులు రైతులకు ఏ రకం విత్త నాలు అవసరమో వివరాలు సేకరించారని, తక్షణం విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. రైతులకు అందించాల్సిన వ్యవసాయ పెట్టుబడులు రైతుభరోసాను ప్రతి రైతుకు రూ.20 వేలు అందించాలన్నారు. జీడి పిక్కలను కొనుగోలు చేసి, మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు.కార్యక్రమంలో సంఘ నేతలు నారాయణ, గురయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రైతులకు అన్ని విధాలా తోడ్పాటు



రైతులకు విత్తనాలను అందిస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

హిరమండలం: ఎన్డీయే ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. శనివారం కల్లట గ్రామంలో రైతులకు వరి విత్తనాలను పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది రైతుకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సంధ్య టీడీపీ నాయకులు టి.తిరుపతిరావు, బద్రి సురేష్, దారపు డిల్లేశ్వరరావు, టి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం



విత్తనాలను అందిస్తున్న నేతలు

మెళియాపుట్టి: మెళియాపుట్టి, మర్రిపాడు-సి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శనివారం విత్తనాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజశేఖరరెడ్డి, పరమేష్ రెడ్డి, వాసు, బానోజీ రావు, శ్రీను, రమణయ్య, రాజమోహన్, గణపతిరావు, జనసేన నాయకులు బాలరాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

జలుమూరు: ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనానికి సంబంధించిన జీవో 117 రద్దుచేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు మెండ రామారావు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ.. ఎన్నికలు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మెగా డీఎస్సీపై సంతకం చేసి నిరుద్యోగులు జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మఒడి పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తింపజేసి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు.

బీమామిత్రలను ఆదుకోండి

మెళియాపుట్టి: గత టీడీపీ ప్రభుత్వంలో పనిచేసిన బీమా మిత్రలను మళ్లీ విధుల్లోకి తీసు కుని ఆదుకోవాలని పూర్వపు బీమా మిత్రలు కోరారు. ఈ మేరకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవింద రావును కలిసి వినతిపత్రం అందించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మమ్మల్ని మోసం చేసి తొలగించారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తమను ఆదుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విమోచిని, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయేతర భూములుగా మార్పునకు నిబంధనలు పాటించాలి

● సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

చింతలబడవంజ(ఎల్.ఎన్.పేట): గ్రామాల్లో రైతులు తమ పంట పొలాలను వ్యాపార స్థలాలుగా మార్చుకునేందుకు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. చింతలబడవంజ గ్రామ సమీపంలో వ్యాపార అనుమతుల కోసం దరఖాస్తుచేసుకున్న రైతుల భూములను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. రైతులు తమ పంట పొలాలను వ్యాపారం, వ్యవసాయేతర భూములుగా మార్చుకోవాలంటే ప్రభుత్వానికి నాలా తప్పనిసరిగా చెల్లించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవసా యేతర భూములుగా మార్చుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణి అమ్మాజీ, మండల సర్వేయర్ ఆర్.గవరయ్య, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.



చింతలబడవంజలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన

● డీఈవో వెంకటేశ్వరరావు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన అందించడం జరుగుతుందని డీఈవో వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక బోర్డు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉన్నత ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలన్నారు. వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనపరిచేలా విద్యార్థులను తీర్చి దిద్దాలన్నారు. అనంతరం మండల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, నోటు పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేటలో పాఠ్యపుస్తకాల పంపిణీని పరిశీలిస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు

ఘన వ్యర్థాలపై అవగాహన కలిగిఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్ఎస్‌వీఎస్ నాయుడు

పలాస: ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎస్ ఎస్‌వీఎస్ నాయుడు కోరారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. పర్యావరణానికి విఘాతం కలిగించే ఘన వ్యర్థాలను పద్ధతి ప్రకారం వినియోగిస్తే అనర్థాలు ఉండవన్నారు. కార్య క్రమంలో న్యాయవాదులు టీకేఆర్ పట్నాయక్, ఎల్.చంద్రశేఖర్, కాళిదాస్, జీఎంఎస్ అనిల్‌రాజు, ఫయ్యాజ్ అహ్మద్, కొమర దేవరాజు, శ్యామ్, రవి కుమార్ పట్నాయక్, బి. కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాసురాజు

సంతబొమ్మాళి: మరువాడ ఎంపీయూపీ పాఠశాలల విద్యార్థులు శనివారం పాఠ్య పుస్తకాలను విద్యా కమిటీ చైర్మన్, జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాడ దాసురాజు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులకు నాణ్య మైన రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకో వాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిట్లు సకాలంలో పంపిణీ పూర్తిచేయాలి

నందిగాం: విద్యార్థులకు కిట్లను సకాలంలో అందజేయాలని ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు సూచించారు. శనివారం మండల స్టాక్‌పాయింట్ నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు పంపిణీ చేపట్టారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో కిట్లు అందించి విద్యా ప్రగతికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు, సిబ్బంది ఉన్నారు.

మదుములు ఇలా.. సాగునీరు ఎలా?

- శిథిలావస్థకు చేరుకున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు



కొర్ని చెరువు మదుము దుస్థితి

(గార)

మండలంలోని వివిధ గ్రామాల్లో సాగునీటి కాలువలు, చెరువుల వద్ద దశాబ్దాల కిందట నిర్మించిన మదుములు నిర్వహణ లేక శిథిలావస్థలో కొట్టుమి ట్టాడుతున్నాయి. వర్షాకాలంలో చెరువులు, కాలువలోకి నీటి ప్రవాహం ఎక్కువయ్యే సమయంతోపాటు రైతులు పొలాలకు సాగునీరు మళ్లించేందుకు వీలుగా గతంలో ఈ మదుములు ఏర్పాటు చేశారు. అయితే కాల క్రమేణా సంబంధిత అధికారులు వీటి నిర్వహణ చేపట్టకపో వడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఫలితంగా వర్షాకాలంలో చెరువులు, కాలువలోకి నీరు చేరినా మదుముల బాగోలేక, నీరంతా వృథాగా కిందకు వెళ్లిపోవడం వల్ల నీటిమట్టం తగ్గిపోయి పొలాలకు నీరు అందించలేని పరిస్థితి నెలకొంది. పలుదఫాలుగా ఆయకట్టు రైతులు ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినా చర్యలు లేవని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాడైన ఈ మదుములను బాగుచేయించి సాగునీటి సమస్య తీర్చాలని మండల రైతులు కోరుతున్నారు.



బచ్చుపేట దగ్గరలోని ఓ చెరువు లోతుగా ఉండి.. ఎత్తుగా ఉన్న మదుము

లోకనాథం అంత్యక్రియలు పూర్తి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సోంపేట: కువైట్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన తామాడ లోకనాథం మృతదేహం స్వగ్రామం జింకిభద్రకు శనివారం తీసుకువచ్చారు. దీంతో కడసారిగా చూసేందుకు గ్రామం మొత్తం తరలివచ్చారు. అనంతరం అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు పూర్తి చేశారు.

పరిహారం అందజేత..

కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన తామాడ లోకనాథం కుటుంబ సభ్యులు పలువురు ఓదార్చారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5లక్షల పరిహారాన్ని ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఆర్డీవో భరత్‌నాయక్ చెక్కును అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే అశోక్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబాన్ని ఆదుకొనేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పాము కాటుతో వృద్ధుడి మృతి



త్రినాథ్(ఫైల్)

కవిటి: గొర్లెపాడు గ్రామానికి చెందిన వృద్ధుడు తీగల త్రినాథ్(79) పాముకాటుకు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లే.. త్రినాథ్ శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో ఇంటి గుమ్మం వద్ద కూర్చొని ఉండగా.. అదే సమయంలో పాము కాటు వేసింది. వెంటనే కుటు సోంపేట ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బరంపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

వడదెబ్బతో వ్యక్తి..



రమణమూర్తి(ఫైల్)

గార: కొర్ని గ్రామానికి చెందిన భావన రమణమూర్తి(60) ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్‌లో వడదెబ్బకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రమణమూర్తి ఇటీవల తన మిత్రులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో శనివారం అస్వస్థతకు గురవ్వడంతో తోటి స్నేహితులు రమణమూర్తిను అలహాబాద్‌లోని ఓ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. వడదెబ్బకు గురై అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. రమణమూర్తితో వెళ్లినవారు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా రమణమూర్తి కొన్నేళ్లుగా ఓ దినపత్రికలో గార మండల విలేకరిగా పనిచేస్తున్నారు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

ఎచ్చెర్ల: ఓ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఈ బాలిక తన తల్లితో కలిసి మండలంలోని ఓ గ్రామంలో నివాసం ఉంటోంది. అయితే ఈ బాలిక తల్లి గుజరాతీపేటకు చెందిన నీలా కృష్ణతో సన్నిహితంగా ఉంటోందని, ఈ క్రమంలో ఈ వ్యక్తి ఇంటికి తరుచూ వస్తూ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆ బాలిక ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. ఇందుకు తన తల్లి కూడా సహకరించిందని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. దీంతో ఆ బాలిక తల్లితో పాటు కృష్ణపై పోక్సో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

హరిపురం: మందస మండలం కొండలోగాం పంచాయతీ రామరాయి, పట్టులోగాం, ఇంద్రాడి వీధి, టబ్బాగాం గ్రామాల్లో సెబ్ అధికారులు శనివారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టబ్బాగాం గ్రామంలో 1600 లీటర్ల బెల్లం ఊట, 80లీటర్ల సారా గుర్తించి ధ్వంసం చేసినట్టు సీఐ జైభీమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఆరు నెలల నుంచి మందస మండలంలో దాడులు చేసి 75 కేసులు నమోదు చేసి 37 మందిని రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు. 1020లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సారా తయారీకి వినియోగించిన పులిసిన బెల్లంతోపాటు వేల కిలోల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకొన్నట్టు చెప్పారు. ఎవరైనా అమ్మకాలు, తయారీ చేసినా 94409 02358 ఫోన్ నెంబరుకు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో సోంపేట, పలాస ఎక్సైజ్ అధికారులు రామచంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



గార: బూరవెల్లిలో ప్రసిద్ధ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించనున్నట్టు ఉత్స వ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఐదు రోజులు ఈ కల్యాణ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి గరుడ వాహనంపై స్వామి వారి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో తిరువీధి నిర్వహించి అనంతరం ఆలయం వద్ద స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తారని ఈ కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి సీతారామస్వామి ఆధ్వర్యంలో ఇతర అర్చక బృందం నిర్వహిస్తారన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశం

ఆమదాలవలస: ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశం చింతాడ జంక్షన్ వద్ద శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు కామ్రేడ్ వీపీ సాను హాజరయ్యారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాను మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా విధానాలపై నిరంతరం ఎస్ఎఫ్ఐ స్పందించి ఖండిస్తుందన్నారు. అయోధ్య రామమందిరంపై ఉన్న శ్రద్ధ దేశ నిరుద్యోగ విద్యార్థి యువజనులపై లేదన్నారు. చివరకు అయోధ్యలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం జరిగిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలో లేని నూతన విద్యా విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేస్తూ విద్యార్థి లోకానికి నష్టం చేసిందన్నారు. నూతన కూటమి ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిందని, మాట నిలబెట్టుకోవాలన్నారు. లేకపోతే ఐక్య పోరాటాలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట కార్యదర్శి వర్గ సభ్యులు వినోద్, రామ్మోహన్, వెంకటేష్, ఎల్‌జే నాయుడు, వెంకటేష్, కిరణ్, పరమేష, రవి, పావని, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.చందు, హరీష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా 'అంగన్‌వాడీ పిలుస్తోంది రా'

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్, బిజే నాయుడుకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు దూసి, తొగరాం అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలో శనివారం 'అంగన్‌వాడీ పిలుస్తోంది రా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇంటింటికి వెళ్లి మూడేళ్లు దాటిన పిల్లలందరికీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

స్వర్గధామంలో అభివృద్ధి పనులు

కంచిలి: కంచిలి గ్రామ శివారులో ఉన్న స్వర్గధామం అభివృద్ధి పనులను సోంపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంచిలికి చెందిన కొత్తకోట నాగరాజు సౌజన్యంతో నిర్మాణం చేపట్టారు. స్వర్గధామం అభివృద్ధి పనులు పూర్తికావడంతో శనివారం సాయంత్రం జిల్లా రోటరీ గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు ప్రారంభించారు. సుమారు రూ.30లక్షల వ్యయంతో స్వర్గధామం చుట్టూ ప్రహరీ, విశ్రాంతి మండపం తదితర పనులు చేపట్టినట్టు రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, కార్యదర్శి పీవీ కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవదాస్ రెడ్డి, జడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి కృష్ణారావు, కె.రవికుమార్, జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తాం



ఎమ్మెల్యే గొండు శంకర్‌ను అభినందిస్తున్న జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకులు

అరసవల్లి: గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు, ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరమైన గ్రంథాలయాల్లో కనీస మౌలిక వసతులు కూడా కరువయ్యాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కేంద్ర గ్రంథాలయ అభివృద్ధికి తాను అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. శనివారం నగరంలోని కేంద్ర గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ నుంచి రావాల్సిన పన్నులు కూడా సకాలంలో అందక గ్రంథాలయ సిబ్బందికి కూడా జీతాలు అందడం లేదన్నారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు తమ సమస్యలను శంకర్ దృష్టికి తీసుకువచ్చారు. కేంద్రమంత్రి రామ్మోహన్ సహకారంతో అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కెల్ల కొండలరావు రూ.10 వేలు, మండల మన్మథరావు రూ.10 వేలు, పేట పద్మ రూ.ఐదు వేలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, తోణంగి వెంకన్నయాదవ్, కవ్వాడి సుశీల, బుర్రి మధు, దుంగ శ్రీధర్, పాండ్రంకి.శంకర్, సిరిపురపు హరి, రాయిపల్లి అర్జున్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు..

ఎమ్మెల్యేగా ఎన్నికైన గొండు శంకర్‌ను రెవెన్యూ సర్వీసుల సంఘం నాయకులు శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు శంకర్ ఘనవిజయం సాధించడంపై శుభాకాంక్షలు తెలియజేశారు. శంకర్‌ను కలిసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాలరావు, జిల్లా కార్యదర్శి బీవీవీఎస్ రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జీకే శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి డి.ప్రకాశరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సచివాలయం ఉద్యోగులు

గార: నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే గొండు శంకర్‌ను శనివారం ఉదయం మండలంలో ఉన్న గ్రామ సచివాలయం ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు. మండల సచివాలయం ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కనకసుందర రాణా, ఉపాధ్యక్షుడు కె.భరత్, కోశాధికారి గంగు డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాల అమలు



సమావేశంలో పాల్గొన్న పీపీలు, తదితరులు

అరసవల్లి: వచ్చే నెల 1వ తేదీ నుంచి దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు అమల్లోకి రానున్నాయని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ మెట్ట మల్లేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు సముదాయంలో గల ప్రాసిక్యూషన్ కార్యాలయంలో ఆయన పీపీలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్షి అదినియం, భారతీయ నాగరిక సురక్ష సంహిత మొదలగు కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాన కృష్ణచంద్, తంగి, శివప్రసాద్, ఎల్‌వీ రమణ, సీహెచ్ సత్యనారాయణ, ఎల్.నాగభూషణం, పి.సుశీల, జి.ప్రియదర్శిని, ఆర్.శాంతి. వి.విజయలక్ష్మి, హరిప్రియ, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వెలుగు సాహితీ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ

ఇచ్ఛాపురం: టీ బరంపురం గ్రామానికి చెందిన జానపద కళాకారుడు, కోలాటం, పండరి భజన గురువు తిప్పన ధనుంజయరెడ్డి తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైనట్టు సంస్థ జాతీయ చైర్మన్ వలబోజు రాజకుమార్ ప్రకటనలో తెలిపారు. కళను పెంపొంది అభివృద్ధి చేయటానికి అహర్నిశలు కష్టపడి మన ప్రాంతంలో ఉన్న కళాకారులను వెలుగులోకి తేవటానికి ప్రయత్నం చేస్తానని ధనుంజయ అన్నారు. ఈ మేరకు కళాకారుడుని ఆల్ ఇండియా కళారంగ వ్యవస్థాపకులు, అధ్యక్షుడు ఎం.సుధీర్, ఆల్ ఇండియా కళారంగం కోశాధికారి డి.జీవన్, ఆల్ ఇండియా కళారంగం జిల్లా అధ్యక్షుడు బుర్రకథ వెంటకరమణ, కళాభారతి కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు అభినందనలు తెలిపారు.

ఘనంగా మిథున సంక్రమణం

ఇచ్ఛాపురం: గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో మిథున సంక్రమణం పూజలు ఘనంగా జరిపారు. శనివారం వేకువ జాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సింధూర మర్దన, కుంకుమార్చనలు, అభిషేకాలు అనంతరం ప్రత్యేక హోమాలు చేశారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు భారీగా తరలివచ్చి పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాలను స్వీకరించారు. పట్టణ పరిధిలో గల ముత్యాలమ్మ, మండపల్లి గ్రామంలో గల గారపోలమ్మ తల్లి అమ్మవారి ఆలయాల్లో కూడా భక్తి శ్రద్ధలతో మిథున సంక్రమాణం పూజలు చేశారు.

విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: మండలంలో రైతులకు అవసరమైన విత్తనాలను ఎమ్మెల్యే బెందాళం అశోక్ చేతులు మీదుగా శనివారం పంపిణీ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో బి.రమేష్, ఎస్‌వీ రమణ, బి.కృష్ణారావు, ఎ.మధు, రాజు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఇచ్ఛాపురం: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే పాఠశాలలపై చర్యలు తప్పవని ఎంఈవో అన్నారు. శనివారం మున్సిపాల్టీ పరిధిలో గల ప్రవేట్ పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో రికార్డు పరిశీలించిన అనంతరం ప్రభుత్వ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎస్ హెచ్ఎం ఎన్.విశ్వనాథం, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: తన కవితలు, గేయాలతో ప్రజా చైతన్యాన్ని రగిల్చిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) నవయుగ వైతాళికుడని పలువురు వక్తలు కొనియాడారు. సాహితీ స్రవంతి శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం డే అండ్ నైట్ జంక్షన్ వద్ద విశ్రాంత ఉద్యోగుల భవనంలో కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు అధ్యక్షతన శ్రీశ్రీ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ.. ప్రబంధ కవిత్వపు ఆంక్షల సంకెళ్లను తెంచి కవితా సరస్వతికి స్వేచ్ఛ కల్పించిన విప్లవ కవి శ్రీశ్రీ అని అన్నారు. అంతకుముందు శ్రీశ్రీ గేయాల్ని చింతాడ రామచంద్రరావు ఆలపించారు. ప్రముఖ కవులు కుప్పిలి వెంకట రాజారావు కంచరాన భుజంగరావు తంగి ఎర్రమ్మ వాసవి నెట్టిమి రమణారావు పత్తి సుమతి స్వీయ కవితా పఠనం చేశారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వీజీకే మూర్తి, ఎం.ప్రభాకర్ ఉదయ్ కిరణ్, బాడాన శ్యామలరావు, దివాకర్, మహిళా నాయకులు కె.నాగమణి, ఎ.లక్ష్మి డి.సుధామణి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరాకి సంబంధించిన పనులపై గ్రామాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈ సూర్యానారాయణ, ఏఈ భాగ్యలక్ష్మి, జేఈ రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయటే విద్యార్థుల సైకిళ్లు



ఆరుబయటే ఉన్న సైకిళ్లు

గార: మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వారి సైకిళ్ల భద్రపరచడానికి అందుబాటులో షెడ్‌లు లేకపోవడంతో ఆరుబయట చెట్లు కింద ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా మండలంలో ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడం వల్ల దూరప్రాంత విద్యార్థులు నిత్యమూ సైకిళ్ల మీదనే పాఠశాలలకు వెళ్లి రావాల్సి వస్తోంది. గార, కొర్ని, కళింగపట్నం, శ్రీకూర్మం, సతివాడ మొదలైన ఉన్నత పాఠశాలలకు రోజూ వందలాది మంది విద్యార్థులు సైకిళ్ల మీదనే వెళ్లి వస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని పాఠశాలల వద్ద వారి సైకిళ్ల భద్రపరచడానికి అందుబాటులో షెడ్స్ లేకపోవడంతో ఆరుబయట ఉంచాల్సి వస్తోంది.

కేబినెట్‌లో స్థానం కల్పించాలి

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో అత్యధిక శాతం జనాభా కలిగిన కళింగ సామాజిక వర్గానికి రాష్ట్ర కేబినెట్‌లో సముచిత స్థానం కల్పించాలని ఆ సామాజిక వర్గ ప్రతినిధులు కోరుతున్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని శాంతినగర్ కాలనీలో గల సామాజిక భవనంలో పలువురు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల విజయంలో తమ సామాజిక వర్గ ఓటర్లు కీలక పాత్ర పోషించారని, వారికి సముచిత గౌరవాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లా నుంచి తమ సామాజిక వర్గం నుంచి గెలుపొందిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ల్లో ఒకరికి మంత్రి పదవి ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో గురుగుబెల్లి నర్సింహమూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకన విధానంలోని లోపాలు సరిదిద్దాలి

పొందూరు: ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న 10వ తరగతి మూల్యాంక ప్రక్రియలో లోపాలను సరిదిద్దాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రశన్న సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం అందించిన ట్యాబుల్లో ఇంటర్నెట్ ఉపయోగించి నిర్దేశించిన యాప్ ద్వారా పేపర్లు దిద్దాలని సూచన్లు ఇచ్చినా ట్యాబ్‌ల్లో యాప్ కనిపించకపోవడంతో గణిత ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉపాధ్యాయులు సాంకేతిక సహాయం కోరినా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. అధికారుల్లు లోపాలను తక్షణమే సరిదిద్దాలని కోరారు.

మంత్రి అనితను కలిసిన 'ఆనెపు'



మంత్రి అనితకు అభినందనలు తెలుపుతున్న రామకృష్ణంనాయుడు

బూర్జ: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను టీడీపీ నాయకుడు, బూర్జ మాజీ జడ్పీటీసీ ఆనెపు రామకృష్ణంనాయుడు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అన్నవరం సత్యదేవుని దర్శనం అనంతరం అనితను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

గోవులను చంపడం నిషేధం

శ్రీకాకుళం క్రైం: జిల్లాలోని ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో సంతోషంగా చేసుకోవాలని ఎస్పీ రాధిక శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17న సోమవారం బక్రీద్ పండుగ ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లకు చర్యలు తీసుకున్నామన్నారు. గోవులను ఒక చోట నుంచి మరొక చోటకు తరలించే క్రమంలో తగిన ధువ పత్రాలను కలిగి ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గోవులను వధించడం పూర్తిగా నిషేధమని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన శిక్షలు అమలు చేస్తామన్నారు. గోవుల అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. మతసామరస్యానికి భంగం కలిగించేలా ఎవరైన రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఏవైన అవాంఛనీయ ఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్పీ రాధిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు

విత్తనాల సరఫరాలో ఇబ్బందులు సరిచేయాలి

పొందూరు: గత వైసీపీ ప్రభుత్వంలో విత్తనాలు ఎరువుల సరఫరాలో రైతులు ఎదుర్కొన్న సమస్యలు, ఇబ్బందులను సరిచేయాలని బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ కో-కన్వీనర్ కిల్లి శ్రీరామమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేఖరులతో మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్ నెంబర్లు, వేలిముద్రలు ద్వారా విత్తనాలు సరఫరా చేసేవారని, వేలిముద్రలు పడనివారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. గతంలో వైసీపీ నాయకులు ఆధార్ నెంబర్ల ద్వారా అక్రమంగా విత్తనాలు సొంతం చేసుకుని బ్లాక్‌లో రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా రైతులకు విక్రయించేవారని ఆరోపించారు. ఈ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం రైతులందరికీ విత్తనాలు అందించాలని కోరారు.

నేటి నుంచి ములాఖత్ వేళల్లో మార్పు

గార: అంపోలు సమీపంలోని జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలు.. శిక్ష ఖైదీలను కలిసేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి వచ్చే వారి బంధువులు, స్నేహితులకు ఇక నుంచి ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటలు మధ్యలో ఇంటర్వ్యూలు ఇవ్వడం జరుగుతుందని జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎస్.నబీఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తమ శాఖ ఉన్నత అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

పొందూరు: మండల పరిధిలో శుక్రవారం కురిసిన ఈదురుగాలులు, భారీ వర్షానికి కూలిని విద్యుత్ స్తంభాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. ఏడీఈ రమణమూర్తి, ఏఈ పి.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు. పొందూరు సబ్‌స్టేషన్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

ఉరుములు, మెరుపులతో వర్షం



పాతపట్నంలో కురుస్తున్న వర్షం

సరుబుజ్జిలి: మండలంలో వివిధ గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి వాతావరణంలో మార్పులతో వర్షం మొదలైంది. వర్షం పడుతున్న సమయంలో భారీ ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీయడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలోని నాలుగు రోడ్లు కూడలి వర్షపునీరుతో చెరువును తలపించింది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

ఈదురు గాలులతో..

ఎల్ఎన్ పేట: మండలంలో శనివారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. భయంక రమైన ఉరుములు, మెరుపులకు ఇళ్లల్లో ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు. సుమారు పది రోజుల నుంచి వర్షం లేకపోవడంతో పాటు ఎండతీవ్రత అధికంగా ఉండడంతో ఉక్కపోతకు గురైన వృద్ధులు, చిన్నారులకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది. మృగశిర కార్తె వచ్చి వారం రోజులు కావడంతో వరి విత్తనాలు వేసేందుకు ఈ వర్షం రైతులకు ఎంతగానో ఉపయోగకరమని పలు గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: పాతపట్నంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురిసింది. రోజంతా ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజానీకం భారీ వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు. పట్టణంలో రోడ్లన్నీ జలమ యమయ్యాయి. వీధుల్లోని రోడ్లు సైతం వర్షపునీటితో నిండిపోయాయి.